

అయినవాళ్లే ప్రాణం తీస్తున్నారు..!

మత్తులో మనిషి మానవత్వాన్ని మరిచిపోతున్నాడు. కన్నవారిని.. కట్టుకున్న వారిని కడతేర్చేలా చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఐదు ఘటనలు చోటు చేసుకున్నాయి. 8లో▸



మహిళలే టార్గెట్

మహిళలనే టార్గెట్ చేస్తూ దుండగులు రెచ్చిపోతున్నారు. అమాయకులకు మాయమాటలు చెప్పి వారి నుంచి అందినకాడికి బంగారం, నగలు దోచుకుంటున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.1 / 19.6

వాతావరణం

ఆకాశం చాలా వరకు నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండగా ఉంటుంది. చలితీవ్రత తగ్గుతుంది.

సరిహద్దులో చీకటి దందా!

- జిల్లాలో జోరుగా పశువుల అక్రమ రవాణా
- పట్టుబడుతున్నా.. అడ్డదారుల్లో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిత్యం వాహనాల్లో కబేళాలకు మూగజీవాలు తరలింపు
- రెండు నెలల్లోనే 21 కేసులు.. 217 పశువులు స్వాధీనం



అక్రమంగా ఏర్పాటు చేసిన స్థావరంలో ఎద్దుకు చికిత్స చేయిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

వాంకిడి(ఆసిఫాబాద్): మూగజీవాల రోదన మిన్నంటుతున్నా పట్టించుకోకుండా ఒక్కో వాహనంలో పదుల సంఖ్యలో కుక్కేస్తున్నారు. ఊపిరాడక మార్గమధ్యలోనే కొన్నిజీవాలు మృత్యువాత పడుతున్నా పట్టించుకోకుండా నిర్దయతో వ్యవహరిస్తున్నారు. పగటి వేళ ప్రధాన రహదారుల గుండా రవాణా చేస్తే పోలీసులు పట్టుకుంటున్నారని రాత్రుల్లో అడ్డదారులు వెతుక్కుంటున్నారు. చట్టం కళ్లు కప్పి మూగజీవాలతో గుట్టుగా సరిహద్దులో చీకటి దందా కొనసాగుతుంది. జిల్లా మీదుగా హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర పట్టణాల్లోని కబేళాలలకు పశువులను తరలిస్తున్నారు. ఓ వైపు జిల్లా పోలీస్ యంత్రాంగం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నా అక్రమార్కులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు.

రెండు నెలల్లో 21 కేసులు..

జిల్లాలో రెండు నెలల వ్యవధిలో 21 కేసులు నమోదయ్యాయి. ఇవి సాధారణంగా పోలీసులకు సమాచారం ఉండటంతో నమోదైన కేసులు మాత్రమే. వాంకిడి, సిర్పూర్(టి), కౌటాల, జైనూర్ మండలాల నుంచి నిత్యం పశువుల వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయి. సమీపంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దందా జోరుగా సాగుతోంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటుండటంతో రాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున వరకు వాహనాలను జిల్లా సరిహద్దు దాటిస్తున్నారు. డిసెంబర్‌లో రెబ్బెనలో 1, వాంకిడి 2, లింగాపూర్ 1, చింతలమానెపల్లి 1, కాగజ్‌నగర్ రూరల్ 3, కాగజ్‌నగర్ టౌన్ 1, పెంచికల్‌పేట్ 2, సిర్పూర్(టి) 1 ఇలా మొత్తం 12 వాహనాలు పట్టుబడ్డాయి. 40 మందిపై కేసులు నమోదు చేశారు. 111 పశువులను గోశాలకు తరలించారు. జనవరిలో ఈస్‌గాంలో 1, కాగజ్‌నగర్‌టౌన్ 1, కెరమెరి 2, సిర్పూర్(టి) 2, వాంకిడి 3.. మొత్తం 9 వాహనాలు పట్టుకుని 32 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. 106 పశువులను గోశాలకు తరలించారు. రెండు నెలల్లో 21 వాహనాలను పట్టుకుని 72 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం ఏఎస్పీ ఒకేరోజు వాంకిడి మండలంలోని గోయేగాం, గణేష్‌పూర్, చిచ్చుపల్లి గ్రామాల శివారులో గుట్టుచప్పుడు కాకుండా పశువులను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన స్థావరాలపై మెరుపు దాడి చేశారు. 100 పశువులను రక్షించి 11 మందిపై కేసు నమోదు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా రవాణా..

పశువులను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసే వ్యాపారులు విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో వాహనంలో రెండు పశువులను మాత్రమే తరలించాల్సి ఉంటుంది. పశువులు కదలడానికి, శ్వాస తీసుకోవడానికి సరిపడా స్థలం ఉండాలి. వ్యవసాయం, పాల ఉత్పత్తికి పనికిరాని వాటిని మాత్రమే కబేళాలకు విక్రయించాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా ధనార్జనే లక్ష్యంగా దందా సాగిస్తున్నారు. బొలేరో వాహనంలో రెండు కంటే ఎక్కువ తీసుకెళ్తే సరిగ్గా శ్వాస కూడా ఆడని పరిస్థితి ఉంటుంది. కానీ ఒక్కో వాహనంలో 10 నుంచి 15 పశువులను కుక్కేస్తున్నారు. ఐచర్ వాహనంలో 30కి పైగా, కంటెయినర్ వంటి భారీ వాహనాల్లో 50కి పైగా పశువులను ఒకేసారి తరలిస్తున్నారు. వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉండటంతో గమ్యం చేరుకునేలోపే కొన్ని పశువులు శ్వాసఆడక మృత్యువాత పడుతున్నాయి.



స్థావరంలో పశువు కళేబరం

కఠిన చర్యలు తప్పవు



జిల్లాలో పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాలను హింసించడం, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. సోమవారం వాంకిడి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశుస్థావరాలపై దాడులు నిర్వహించి దాదాపు వంద మూగజీవాలను గోశాలకు తరలించాం. పలువురిపై కేసులు నమోదు చేశాం. వాటిలో ఒక పశువుకు చికిత్స చేయించినా కాపాడలేకపోయాం. జిల్లావ్యాప్తంగా పశువుల రవాణా అరికట్టేందుకు నిఘా పటిష్టం చేశాం.

– చిత్తరంజన్, ఏఎస్పీ

చీకటి దందా ఇలా..

జిల్లాలోని వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(టి), కౌటాల మండలాలు మహారాష్ట్రకు సరిహద్దులుగా ఉన్నాయి. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా కౌటాల మండలానికి సమీపంలో ఉంది. అక్రమార్కులు అక్కడి నుంచి పశువులను తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. అలాగే గ్రామాల్లో తిరుగుతూ రైతులకు మాయమాటలు చెబుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన పశువులను గ్రామాలకు దూరంగా ఉండే పంట పొలాల్లో స్థావరాలు ఏర్పాటు చేసి కట్టేస్తున్నారు. గ్రామాల్లోని అమాయక ఆదివాసీ యువకులకు డబ్బు ఆశచూపి కొనుగోలు చేసిన పశువులను వాహనాల్లో ఎక్కించేంత వరకు కాపలాదారులుగా నియమించుకుంటున్నారు. పోలీసులు దాడులు నిర్వహించినా కొన్ని సందర్భాల్లో అమాయకులే వారికి చిక్కుతున్నారు. స్థావరాల్లో పశువులకు ఆహారం, నీరు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నాయి. వాంకిడి మండలంలోని గోయెగాం, గణేష్‌పూర్ గ్రామాల నుంచి.. అలాగే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పశువులు పెద్దఎత్తున ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నాయి. పోలీసులు పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించడంతో చిన్నవాహనాల్లో తరలిస్తున్నారు. ఐచర్, కంటెయినర్ వంటి వాహనాలు పట్టుబడితే పెద్దమొత్తంలో నష్టం వస్తుందని, బొలేరో వంటి వాహనాలను ఎంచుకుంటున్నారు. రాత్రి 10 గంటల నుంచి వాహనాల్లో పశువులను ఎక్కించడం ప్రారంభిస్తారు. రాత్రి 12 గంటల తర్వాత నుంచి అడ్డదారుల గుండా వాహనాలను రోడ్డుపైకి తీసుకొస్తారు. చెక్‌పోస్టులు, టోల్‌గేట్లు, పోలీసు చెకింగ్‌లు ఉండే ప్రధాన కూడళ్లు దాటే వరకు ఎస్కార్ట్‌గా ఒక కారు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా వందలాది పశువులు నిత్యం రవాణా అవుతున్నాయి.

న్యూస్‌రీల్

బ్రీత్ ఎనలైజర్లు అందజేత



బ్రీత్ ఎనలైజర్లు అందిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బ్రీత్ ఎనలైజర్లు అందించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించే వాహనాల తనిఖీల్లో ఈ ఆధునిక బ్రీత్ ఎనలైజర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేసేందుకు వినియోగించుకోవాలని సూచించారు.

వాహనాల పన్నులు సకాలంలో చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనాలకు సంబంధించిన పనులు సకాలంలో చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వాహనాలపై అపరాధ రుసుం వసూలు చేయనున్నట్లు తెలిపారు. వాహనానికి సంబంధించిన ఫిట్‌నెస్, పర్మిట్, వాహన బీమా, పొల్యూషన్ వంటి ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేసుకోవాలన్నారు. తనిఖీల్లో పట్టుబడితే అదనంగా పన్ను రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

‘కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్’



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో కార్మిక వర్గానికి, తెలంగాణ రాష్ట్రాన్ని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను రద్దు చేయాలని, ఎఫ్‌డీఐలను ఉపసంహరించుకోవాలని, సింగరేణికి బొగ్గు బ్లాకులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, సుధాకర్, శ్రీనివాస్, మల్లేశం, ప్రవీణ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో సేఫ్టీ జీఎం పర్యటన



ఓసీపీని పరిశీలిస్తున్న సేఫ్టీ జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో బుధవారం సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పర్యటించారు. ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఓసీపీలోని ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ప్రాజెక్టు ఉత్పత్తి వివరాలను ఏరియా జీఎం వివరించారు. అనంతరం ఓసీపీ పని ప్రదేశాలకు వెళ్లి రక్షణ చర్యలను పరిశీలించారు. ఆఫ్ లోడింగ్‌తో పాటు రక్షణ విషయంలో సింగరేణి పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. అంతర్గత డంపులు, బొగ్గు బెంచ్‌లను పరిశీలించారు. ఉత్పత్తితోపాటు రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిఒక్కరూ రక్షణ సూత్రాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కె.రఘుకుమార్, ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

మహార్‌ల వివరాలు మళ్లీ సేకరించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పలు అనుమానాలతో మహార్ కులస్తులు కులగణన సర్వేలో పాల్గొనలేదని, ప్రభుత్వం మహార్‌ల వివరాలు మళ్లీ సేకరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మూడు వేలు ఉన్న మహార్‌ల జనాభా 32 వేలకు పెరిగిందని, స్పష్టంగా సర్వే నిర్వహిస్తే మూడు లక్షల వరకు పెరుగుతుందని తెలిపారు. మళ్లీ సర్వే నిర్వహించి, ఎస్సీ వర్గీకరణలో మహార్లకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

నిరుపేద కుటుంబాల అభివృద్ధిపై దృష్టి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఉన్న అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారి అభివృద్ధిపై దృష్టి సారించాలని సెర్ప్ సీఈవో దివ్య అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూర్, నారాయణపేట, ములుగు జిల్లాల కలెక్టర్లు, డీఆర్‌డీఏ అధికారులతో తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమంపై సమీక్షించారు. సీఈవో మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అత్యంత వెనుకబడిన నిరుపేద కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేల కుటుంబాలను గుర్తించి జీవన ప్రమాణాలు మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఆర్‌డీవో దత్తారావు, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీల సుస్థిర జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నిరుపేద కుటుంబాలకు ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, విద్య, వైద్యం, బ్యాంకింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మండలానికో సమన్వయకర్తను నియమించి, తాగునీరు, విద్యుత్, రహదారి, ఇతర వనరులు అందిస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా సుస్థిర ఆదాయ వనరులు సమకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు



సిర్పూర్(టి) కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు కేంద్రాలను డీఐఈవో కళ్యాణి తనిఖీ చేశారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు జనరల్ విభాగంలో 538 మందికి 506 మంది హాజరుకాగా, ఒకేషనల్‌లో 568 మందికి 488 హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు జనరల్ విభాగంలో 389 మందికి 373 మంది, ఒకేషనల్ విభాగంలో 466 మందికి 449 మంది హాజరయ్యారని డీఐఈవో తెలిపారు.



పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

జిల్లా కేంద్రంలోని శ్రీబాలేశ్వరస్వామి ఆలయంలో జనవరి 30న ప్రారంభమైన నవ రాత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు ఆలయంలో అర్చకులు శ్రీధర్‌శర్మ, అజయ్, సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి అన్నపూజ, షోడ ఉపచార పూజలు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, రాజోపచారము, తీర్థప్రసాద వితరణ తదితర పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు.

– ఆసిఫాబాద్‌అర్బన్

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: నులిపురుగుల నిర్మూలనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న జిల్లాలోని 11,67,000 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. ఆ రోజు మాత్రలు అందని వారికి ఈ నెల 17న మరోసారి అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రలు అందించాలని ఆదేశించారు. రెండేళ్ల లోపు వారికి సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్లలోపు వారికి పూర్తి మాత్ర వేయాలని, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం, డీపీవో భిక్షపతి గౌడ్, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మత్స్యశాఖ ద్వారా రాయితీతో మంజూరైన చేపల విక్రయ సంచార వాహనాన్ని డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి బుధవారం పరిశీలించారు. మహిళా శక్తి పథకంలో క్యాంటీన్లు, మీసేవ కేంద్రాలు, పెరటికోళ్లు, కోళ్ల ఫామ్, డెయిరీ ఇతర అవకాశాలు కల్పిస్తుందన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని మహిళా స్వయం సహాయక సభ్యురాలు స్వరూపకు వాహనం మంజూరైందని తెలిపారు. సభ్యురాలు రూ.4లక్షలు చెల్లించగా, రూ.6లక్షల రాయితీతో రూ.10లక్షల వాహనం మంజూరైందని తెలిపారు. అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, సెర్ప్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ప్రణాళికాబద్ధంగా చదివితే విద్యార్థులు విజయం సాధించవచ్చని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా ఏకాగ్రతతో చదవాలన్నారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘పట్టు’ సడలింది..!

- ఈ ఏడాది తగ్గిన దసలి పట్టు దిగుబడి
- తీవ్ర ప్రభావం చూపిన వర్షాలు, తెగుళ్లు
- వేలం నిర్వహించిన అధికారులు
- ధర తగ్గడంతో రైతులకు నిరాశ



రైతులు పండించిన పట్టుగూళ్లు

కౌటాల(సిర్పూర్): ప్రకృతి సిద్ధంగా లభించే దసలి పట్టుతో ఆదివాసీ గిరిజనులు ఏటా ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది ఆశించిన దిగుబడి, ధర లేక రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా పట్టు దిగుబడి తగ్గింది.

అడవే ఆధారం..

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే ఆదివాసీ గిరిజన రైతులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం దసలి పట్టు పురుగుల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని భూమి లేని రైతులను గుర్తించి దసలి పెంపకంపై శిక్షణనిచ్చింది. కౌటాల మండలంలోని తలోడి దసలి పట్టు పరిశ్రమ పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో 40ఏళ్లుగా వారు ఉపాధి పొందుతున్నారు. కౌటాల మండలం తలోడి, చింతలమానెపల్లి మండలం కోర్సిని, అంబగట్టు, గంగాపూర్, కర్జెల్లి, బెజ్జూర్ మండలం ముంజంపల్లి, కాటెపల్లికి చెందిన గిరిజన కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో పట్టు పెంచే రైతులు సుమారు 300 మంది ఉన్నారు.

పడిపోయిన దిగుబడి

దసలి పట్టు సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. రైతు శ్రమే పెట్టుబడి. దసలి పట్టు పరిశ్రమలో 50శాతం సబ్సిడీపై రూ.2వేల నుంచి రూ.3 వేల గుడ్లను కొనుగోలు చేస్తారు. అంతకు మించి పెద్దగా ఖర్చులు ఉండవు. గుడ్ల నుంచి పట్టు పురుగులు బయటికి వచ్చిన తర్వాత వాటిని చెట్లపైకి వదులుతారు. పట్టు పురుగులు ఆకులను తింటూ 20 రోజులకు దసలి పట్టు కాయగా మారుతాయి. పట్టు పురుగులను పక్షులు తినకుండా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. రెండు నెలల పాటు కష్టపడితే కాయ చేతికి అందుతుంది. కానీ ఈ ఏడాది వర్షాల కారణంగా పట్టు గూళ్లకు తెగుళ్లు సోకాయి. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల పరిధిలోని 180 మంది రైతులు పట్టు సాగు చేయగా.. ఎనిమిది లక్షల పట్టు పురుగుల దిగుబడి వచ్చింది. గతేడాది 10.62 లక్షల దిగుబడి రాగా.. ఈసారి 2.62 లక్షల దిగుబడి తగ్గింది.

ధర కూడా అంతంతే..

జిల్లాలోని గిరిజన రైతులు పండించిన దసలి పట్టు కాయలు చేతికందగానే తలోడి పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయానికి తీసుకొస్తారు. తలోడి దసలి పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో పొరుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు విక్రయిస్తారు. బుధవారం తలోడి పట్టు పరిశ్రమలో పట్టుగూళ్లకు అధికారులు వేలం వేయగా.. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. వెయ్యి గూళ్లకు రూ.4,500 ధర చెల్లించి కొనుగోలు చేశారు. గతేడాది రూ.5,500 ధర పలుకగా.. ఈసారి వెయ్యి గూళ్లకు రూ.1000 ధర తగ్గింది. పంట దిగుబడి తగ్గడంతో పాటు ధర సైతం అంతంతే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన పట్టు దిగుబడి

పట్టుపురుగుల పంట కాలం తక్కువగా ఉంటుంది. వ్యవసాయ భూమి లేకపోవడంతో పట్టుపురుగుల సాగుపైనే ఆధారపడి బతుకుతున్నాం. ఈసారి తెగుళ్లు సోకి 11 వేల పట్టుగూళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. గతేడాది 20 వేల పట్టుగూళ్ల దిగుబడి వచ్చింది. ఏనాడూ పట్టు పెంపకంలో నష్టం రాలేదు.

– సదయ్య, అంబగట్టు, చింతలమానెపల్లి

ధర తగ్గింది

20 ఏళ్లుగా పట్టుగూళ్లు సాగుచేస్తున్నాను. ఈ ఏడాది పట్టుకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గింది. 15 వేల పట్టుగూళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. పట్టు పురుగు నాణ్యత తగ్గడంతో వెయ్యి గూళ్లను రూ.4500లకే విక్రయించాం. గతేడాది కంటే ధర రూ.1000 తగ్గింది.

– ధర్మయ్య, గంగాపూర్, చింతలమానెపల్లి

తెగుళ్లు సోకడంతోనే..

తలోడిలో పట్టు వేలం నిర్వహించగా పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు పాల్గొన్నారు. వెయ్యి కాయలకు రూ.4,500 చెల్లించారు. వర్షాలు రావడంతో తెగుళ్లు సోకి దిగుబడి తగ్గింది. నాణ్యత లేకపోవడంతో వ్యాపారులు ధర పెట్టలేదు. రానున్న రోజుల్లో దిగుబడి పెంపునకు కృషి చేస్తాం.

– సోము, టీఏ, పట్టు పరిశ్రమ, కౌటాల

వేలం పూర్తి

కౌటాల మండలంలోని తలోడి దసలి పట్టు పరిశ్రమ కార్యాలయంలో బుధవారం ఉద్యానవనశాఖ అధికారులు, వ్యాపారులు పట్టు పురుగుల వేలం నిర్వహించారు. స్థానిక రైతుల నుంచి జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వెయ్యి పట్టు పురుగులకు రూ.4500 ధర చెల్లించారు. సెరి కల్చర్ జేడీ జి.అనసూయ మాట్లాడుతూ తలోడి పట్టు పరిశ్రమ పరిధిలో 8 లక్షల పట్టు పురుగుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. అధికారులు పార్వతి, శ్రీనివాసులు, నదీం, సుప్రజ, సోము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య


దెబ్బడి ప్రవీణ్ (ఫైల్)

తలమడుగు: మద్యం మత్తులో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అంజమ్మ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన దెబ్బడి ప్రవీణ్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసై కూలీ పనులకు కూడా వెళ్లడం లేదు. బుధవారం మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న యువకుడి గుర్తింపు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లెటైవర్ బ్రిడ్జి సమీపంలో ఈ నెల 4న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిని గుర్తించినట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్‌లోని కృష్ణ కాలనీకి చెందిన బోగె రాజు–ఇంద్రాదేవి దంపతుల కుమారుడు అఖిల్ (32)ఎంబీఏ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఒకవైపు ఉద్యోగం రాకపోవడం, మరోవైపు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి


నరేశ్ మృతదేహం

బెల్లంపల్లి: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని కన్నాలబస్తీ శివారులో చోటు చేసుకుంది. బెల్లంపల్లి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపిన వివరాల మేరకు బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన నంది నరేశ్ (29) మృతదేహాన్ని కన్నాల రైల్వే గేట్ వద్ద గుర్తించారు. మంగళవారం తెల్లవారు జామున రైలు కిందపడి మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుని ఒంటిపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. బుధవారం మృతుని సోదరుడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


గంగాధర్ (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది మదర్సా వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కమలాపూర్‌కు చెందిన భౌరే గంగాధర్ (67) కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం సీతాగోంది సమీపంలో ఉన్న తమ చేనువద్దకు స్కూటీపై వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా యూటర్న్ తీసుకునే క్రమంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

అయినవాళ్లే ప్రాణం తీస్తున్నారు..!

- కుటుంబాల్లో వ్యసనం చిచ్చు
- మద్యం, గంజాయి మత్తులో హత్యలు
- నెల వ్యవధిలో ఐదు ఘటనలు

సాక్షి, మంచిర్యాలడెస్క్: ''మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు..'' అన్నాడో కవి. ఏ సంఘటనలు ఆ వాక్యాలకు ప్రేరణ ఇచ్చాయో గానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు అక్షర సత్యం అనిపించేలా ఉన్నాయి. మద్యం, గంజాయి మత్తు మనిషిలోని మానవత్వాన్ని నశింపజేస్తున్నాయి. కన్నవారిని.. కట్టుకున్న వారిని కడతేర్చేలా చేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఐదు ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

గంజాయి, మద్యానికి బానిసై..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఏదో ఒకచోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో 26కేసుల్లో పట్టుబడిన 78కిలోల గంజాయిని పోలీసులు డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 20న, ఇచ్చోడ ఎక్సైజ్ పోలీసులకు వివిధ కేసుల్లో పట్టుబడిన 356 కిలోల గంజాయిని జనవరి 27న నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలోని సెంటర్‌లో దహనం చేశారు. కుమురంభీం జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో 53 కేసుల్లో పట్టుబడిన రూ.74లక్షల విలువైన 117.8 కిలోల గంజాయిని కరీంనగర్ జిల్లాలోని సెంటర్‌లో జనవరి 22న దహనం చేశారు. గంజాయి నిర్మూలనకు పోలీసులు అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా దిగుమతి అవుతూనే ఉంది. గంజాయి వ్యసనంగా మారిన యువత మత్తులో అరాచకాలకు తెగిస్తున్నారు. ఇక మద్యం అమ్మకాలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. మద్యానికి బా నిసైన వారి వల్ల కుటుంబ సభ్యులు వేధింపులకు గురవుతున్నారు.

మారాలనుకుంటే..

మద్యం మత్తు, గంజాయి వ్యసనం నుంచి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. టోల్‌ఫ్రీ నంబరు 14446కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. ఆదిలాబాద్‌లో డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ ఆడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ డీ ఆడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

ఆమెపైనే భారం..!

నార్నూర్ మండలం భీంపూర్ కొలాంగూడకు చెందిన ఆత్రం మరోతి తన భార్య రుక్కుబాయిపై అనుమానం పెంచుకున్నాడు. ప్రతీ రోజు మద్యం మత్తులో ఆమెతో గొడవ పడేవాడు. మంగళవారం అర్ధరాత్రి రుక్కుబాయిని కొట్టి చంపాడు. మరోతికి ఇద్దరు భార్యలు ఉండగా.. రెండో భార్యను కొట్టి చంపాడు. మొదటి భార్యకు ముగ్గురు పిల్లలు, రెండో భార్యకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఆరుగురు పిల్లల భారం కూడా మొదటి భార్యపైనే పడింది.



ఒంటరైన పిల్లలు..



ముధోల్ మండలం అష్ట గ్రామానికి చెందిన చిన్న గజ్జన్న భార్య కరోనా సమయంలో చనిపోయింది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈయనకు ఇద్దరు పిల్లలు గంగాధర్(13), పుష్ప(9) ఉన్నారు. వీరిని చిన్న గజ్జన్న తల్లి ఈరాబాయి (65) భిక్షాటన చేస్తూ, పింఛన్ డబ్బులతో పోషించేది. డబ్బుల కోసం వేధించిన చిన్న గజ్జన్న జనవరి 25న ఆమెను కొట్టి చంపాడు. అటు ఏ బాధ్యత లేని తండ్రి జైలుకు వెళ్లగా.. ఇటు వృద్ధాప్యంలోనూ బాధ్యత తీసుకున్న నానమ్మ చనిపోయింది. ఇద్దరు పిల్లలూ ఒంటరయ్యారు.

తల్లికి మరిన్ని కష్టాలు

జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన అవిడపు సాయిసిద్ధార్థ తన తల్లిని తండ్రి రాజయ్య వేధిస్తున్నాడని అతడిపై కోపం పెంచుకున్నాడు. తండ్రిని కడతేరిస్తే తల్లి కష్టాలు తీరుతాయని భావించాడు. జనవరి 24న గంజాయి, మద్యం మత్తులో ఇద్దరు మైనర్ స్నేహితులతో కలిసి తండ్రిని దారుణంగా కత్తులతో పొడిచి చంపాడు. తండ్రిని చంపి తాను జైలుకు వెళ్తే తల్లి ఒంటరి అవుతుందని సాయిసిద్ధార్థ ఊహించలేదేమో!. ఆ తల్లికి మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు.

- రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పుప్పాల సతీశ్ నిత్యం మద్యం తాగి ఇంటికి వెళ్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. జనవరి 16న మద్యం తాగి వచ్చిన సతీశ్‌కు భార్య రజిత పురుగుల మందు తాగించింది. దీంతో అతడు మృతి చెందాడు.
- జన్నారం మండలం కొత్తూరుపల్లికి చెందిన మడావి కౌసల్య(50) భర్త నుంచి విడిపోయింది. ఆమె చెల్లెలికి ఇద్దరు కుమారులు కృష్ణ, మోహన్‌రావు ఉన్నారు. మోహన్‌రావును ఆమె దత్తత తీసుకుంది. కృష్ణ ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఏదైనా పని చేసుకోవాలని కౌసల్య చెప్పడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. జనవరి 16న కౌసల్య పొలం పనులు చేస్తుండగా కృష్ణ గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు.

అనుమానంతో భార్యను చంపిన భర్త

- భీంపూర్ కొలాంగూడలో ఘటన


ఆత్రం రుక్కుబాయి మృతదేహం

నార్నూర్: భార్యపై అనుమానం పెనుభూతమైంది. విచక్షణ కోల్పోయిన భర్త భార్యను అతికిరాతకంగా బండరాయితో కొట్టి చంపాడు. ఈ సంఘటన నార్నూర్ మండలం భీంపూర్ కొలాంగూడ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ రహీంపాషా తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం మరోతికి ఇద్దరు భార్యలు సోంబాయి, రుక్కుబాయి ఉన్నారు. ప్రతీ రోజు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదటి భార్య సోంబాయికి ఇద్దరు కుమారులు, కూతురు, రెండో భార్య రుక్కుబాయికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మద్యానికి బానిసైన మరోతి రుక్కుబాయిపై అనుమానం పెంచుకున్నాడు. ప్రతీ రోజు తాగొచ్చి గొడవ పడేవాడు. వివాహేతర సంబంధం ఉందని, చంపేస్తానని ఆమెను వేధించేవాడు. మంగళవారం అర్ధరాత్రి 12.30గంటల ప్రాంతంలో మరోతి మద్యం మత్తులో ఆమెతో గొడవపడ్డాడు. బండ రాయితో రుక్కుబాయి(26) ముఖం, ఛాతిపైన కొట్టి చంపి పారిపోయాడని సీఐ తెలిపారు. మృతురాలి తమ్ముడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన మాజీ ఎంపీ 'సోయం'


మంత్రి సీతక్కతో సోయం బాపూరావు

ఇచ్చోడ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను బుధవారం మాజీ ఎంపీ సోయం బాపూరావు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంత్రిని కలిసి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధితో పాటు తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం.

రిమాండ్‌కు తరలింపు

బోథ్: యువకుడి మృతికి కారణమైన మండలంలోని పిప్పల్ ధరి గ్రామానికి చెందిన బండారి చంద్రశేఖర్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. చంద్రశేఖర్ ఈ నెల 2న తన చేనులో పంట రక్షణ కోసం విద్యుత్ వైర్లు అమర్చగా కరత్వాడ గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ వాటిని తాకడంతో మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మధ్యప్రదేశ్‌కు చెందిన 8 మంది వన్యప్రాణుల వేటగాళ్లను కాగజ్‌నగర్ ఫారెస్టు అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎఫ్‌డీఓ సుశాంత్ బుధవారం తెలిపారు. వారివద్ద వన్యప్రాణులకు సంబంధించిన కొన్ని నమూనాలను సేకరించి ఫారెన్సిక్ ల్యాబ్‌కు పంపించామన్నారు. అటవీశాఖ చట్టం ప్రకారం నిందితులను కోర్టులో పరిచి ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించామన్నారు. సదరు నిందితులు గతంలో మరికొందరితో కలిసి వన్యప్రాణులను వేటాడినట్లు సమాచారం ఉందన్నారు.

పశువుల కాపరిని కొట్టారని రాస్తారోకో

జన్నారం: పశువులను మేపేందుకు అడవికి వెళ్లిన మండలంలోని ఇందన్‌పల్లి కాపరి ఆలుగొట్టు రాజన్నపై బీట్ అధికారి రుబీనా దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై పశువులను ఉంచి ఆందోళనకు దిగారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న ఎస్సై రాజవర్ధన్ అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. బీట్ అధికారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని, ఆందోళన విరమించాలని కోరారు. అయినా వినకుండా రేంజ్ అధికారి వచ్చి మాట్లాడాలని పట్టుబట్టారు. రేంజ్ అధికారి కారం శ్రీనివాస్‌తో మాట్లాడించగా తమకు పశువులను మేపేందుకు మరింత స్థలం కావాలని కోరారు. ఇప్పటికే మూడెకరాల అటవీ భూమిని పశువులకోసం కేటాయించామని, అదనపు స్థలం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విక్రంరావు, మల్లేశ్, కిరణ్, కృష్ణ, భగవంతరావు, తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న ఇందన్‌పల్లి గ్రామస్తులు

నాలుగు పశువుల పాకలు దగ్ధం

- మంటల్లో చిక్కుకుని ఒక ఎద్దు మృతి
- మరో ఎద్దుకు తీవ్రగాయాలు

సారంగపూర్: మండలంలోని లింగాపూర్‌తండాలో బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నాలుగు పశువుల పాకలకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. మంటల్లో చిక్కుకున్న ఒక ఎద్దు సజీవ సమాధి అయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని తొడసం గాంధారీ బాయికి చెందిన పశువుల పాకల్లోంచి మంటలు రావడం గమనించిన స్థానికులు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే గాంధారీ బాయికి చెందిన ఒక ఎద్దు మృతి చెందగా మరో ఎద్దుకు తీవ్రగాయాలయ్యాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో పాటు పక్కనే ఉన్న పూలన్నకు చెందిన పశువుల పాకకు నిప్పంటుకోవడంతో అందులో కట్టేసిన రెండు ఎద్దులకు వీపులు కాలిపోయాయి. మిగతా పాకల్లో ఉన్న పశువులను బయటకు పంపించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ఎంఆర్‌ఐ నర్సయ్య ప్రాథమికంగా అంచనా వేశారు. ఘటనా స్థలాన్ని ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.


అగ్నిప్రమాదంలో గాయపడిన ఎద్దు

శభాష్ అంబులెన్స్ సిబ్బంది

వేమనపల్లి: పురుటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులకు 108 సిబ్బంది అండగా నిలిచారు. ఒకే రోజు గంటల వ్యవధిలో ఇద్దరు మహిళలకు సుఖ ప్రసవం చేశారు. ముల్కలపేటకు చెందిన ఉండేపల్లి దీపిక బుధవారం ఉదయం పురుటినొప్పులు రావడంతో 108లో చెన్నూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ రమేశ్ ఈఆర్‌సీపీ వైద్యాధికారి సలహా మేరకు మహిళకు సుఖప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. సాయంత్రం రాచర్ల గ్రామానికి చెందిన జిలపల్లి సుమకు పురుటినొప్పులు 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. శిశువు మెడలో బొడ్డు తాడుతో చుట్టుకొని ప్రమాదకర స్థితిలో ఉండగా ఈఎంటీ జనార్దన్‌రెడ్డి బొడ్డు తాడు తొలగించి కాన్పు చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కాన్పులు చేసిన 108 సిబ్బంది సంపత్, హిమామ్ షరీఫ్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

'వసుధార' పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో నేరేళ్ల పుండరికనాథ రచించిన వసుధార కవిత పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష, సాహిత్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వ్యక్తులను, సమాజాన్ని ప్రేరేపించి విద్యావంతులను చేసేశక్తి సాహిత్యానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంపాసాహిత్య పీఠం అధ్యక్షుడు అజయ్‌కుమార్, సభ్యులు శేషతల్పసాయి, హెచ్‌వోడీ డాక్టర్ రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, రాములు, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాల్వలో యువకుడి గల్లంతు

హాలియా: నల్లగొండ జిల్లా హాలియా సమీపంలోని సాగర్ ఎడమ కాల్వలో బుధవారం యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన పెంద్యాల అనిల్ (19) ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన ఫ్లెక్సీలను కట్టేందుకు మంగళవారం రాత్రి హాలియాకు వచ్చాడు. బుధవారం ఉదయం ముఖం కడుక్కునేందుకు సాగర్ ఎడమ కాల్వ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. అనిల్ సోదరుడు పెంద్యాల పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్‌రెడ్డి తెలిపారు.

మహిళలే టార్గెట్

- నమ్మించి బంగారం ఎత్తుకెళ్తున్న దుండగులు
- రుణాలు..లక్కీ కూపన్లు అంటూ టోకరా
- ఇటీవల ఓ మహిళ నుంచి బంగారం ఎత్తుకెళ్లిన దుండగుడు
- నిందితుడిపై ఇప్పటికే 50 కేసులు నమోదు
- తెలంగాణ, మహారాష్ట్రలో చోరీలకు పాల్పడుతున్న వైనం


షేక్ అల్తాఫ్ అలియాస్ అహ్మద్ బిస్మిల్లా

ఆదిలాబాద్‌టౌన్: లాటరీ తగిలింది.. లక్కీ కూపన్ ద్వారా ఎంపికయ్యారు.. మీకు బ్యాంక్ రుణం ఇస్తాం.. మీ కుటుంబ సభ్యులు పోలీసు కేసులో ఇరుక్కుపోయారు.. ఇలా అనేక మాయమాటలు చెప్పి కొంతమంది దుండగులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. మహిళ వద్ద ఉన్న రెండున్నర తులాల బంగారాన్ని ఓ దుండగుడు ఎత్తుకెళ్లాడు. వేషాలు మార్చుతూ ఎవరు గుర్తుపట్టకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నాడు. ఇలాంటి మోసగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మహిళలనే టార్గెట్ చేస్తూ వారి మెడలో ఉన్న బంగారం ఎత్తుకెళ్తున్నారు. తీరా లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన దుండగుడు ఏకంగా 50 వరకు ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడు. బంగారు ఆభరణం కోసం ఏకంగా మహారాష్ట్రలోని బల్సోడిలోని అంతులేనగర్‌లో ఓ మహిళపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు.

నమ్మించి బంగారం ఎత్తుకెళ్లిన దుండగుడు..

ఈ నెల 1న ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటివద్దకు వెళ్లి అక్కడ ఉన్న ఓ మహిళతో మీరు సిమెంట్ బ్యాగులు కొనుగోలు చేసినందుకు లక్కీ కూపన్ వచ్చింది.. లక్ష రూపాయల విలువ గల వస్తువులు లేదా నగదు తీసుకోవచ్చని నమ్మించాడు. తన బైక్‌పైనే ఆ మహిళను తీసుకెళ్లి సిమెంట్ షాప్ మూసి ఉందని అక్కడే ఉండాలని చెప్పాడు. ఆభరణాలు ఉంటే డబ్బులు ఇవ్వరని, తీసి తనకు ఇవ్వమని మాయమాటలు చెప్పి నమ్మించాడు. రెండున్నర తులాల బంగారం ఇవ్వడంతో అక్కడినుంచి పరారయ్యాడు.


టోపీ ధరించి బైక్‌పై వెళ్తున్న నిందితుడు

నిర్మల్ జిల్లాలో ఇలాంటివే రెండు ఘటనలు..

- నిర్మల్ రూరల్ మండలంలోని డెంగ్యాపూర్‌కు చెందిన ఓ మహిళకు రూ.50 వేల రుణం మంజూరైందని నకిలీ బ్యాంక్ ఆఫీసర్ నమ్మించాడు. మెడలో బంగారం ఉంటే రుణం ఇవ్వరని, ఆభరణాలు ఇంట్లో పెట్టాలని చెప్పాడు. దీంతో ఆ మహిళ తన మెడలో ఉన్న గొలుసుతో పాటు చెవులకు ఉన్న పడిగెలను తీసి టిఫిన్‌బాక్సులో పెట్టి ఇంట్లో పెట్టింది. తాగడానికి నీళ్లు ఇవ్వాలని అడగడంతో సదరు మహిళ కిచెన్‌లోనికి వెళ్లగా ఆ టిఫిన్ బాక్సులో ఉన్న ఆభరణాలను తీసుకొని పరారయ్యాడు.
- నిర్మల్ జిల్లా పెంబి మండలానికి చెందిన ఓ మహిళకు బ్యాంకు రుణం ఇస్తామని చెప్పి గుర్తు తెలియని వ్యక్తి ఇంటికి వచ్చాడు. మెడలో ఉన్న ఆభరణాలు ఫ్రిజ్‌లో పెట్టాలని చెప్పాడు. ఆ తర్వాత వాటిని తీసుకుని పరారయ్యాడు. ఇలాంటి సంఘటనలు తరచూ ఏదోఒక చోటు జరుగుతూనే ఉన్నాయి.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు..



దుండగులు మాయమాటలు చెప్పి బంగారు ఆభరణాలు దోచుకెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలను నమ్మించి నగలు ఎత్తుకెళ్తున్నారు. ఇలాంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లక్కీ కూపన్లు, బ్యాంక్ రుణాలు అంటూ ఇంటి వద్దకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

– ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

వేషాలు మార్చుతూ.. మోసం

హైదరాబాద్‌లోని యాఖుబ్‌పూరకు చెందిన షేక్ అల్తాఫ్ అలియాస్ అహ్మద్ బిస్మిల్లా మాయమాటలు చెప్తూ చోరీలకు పాల్పడ్డాడు. ఇతనిపై ఇరు రాష్ట్రాల్లో 50కి పైగా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లగా పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఇలాంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఒక నామినేషన్

కరీంనగర్ అర్బన్: కరీంనగర్–మెదక్ – నిజామాబాద్– ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. అభ్యర్థి నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి నామినేషన్ స్వీకరించారు. ఇప్పటివరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ స్థానానికి 9మంది నామినేషన్ వేశారు. ఇదివరకే నామినేషన్ వేసిన సిలివేరి శ్రీకాంత్ ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీకి మరో సెట్ నామినేషన్ వేయగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేసిన పిడిశెట్టి రాజు మరోసెట్ దాఖలు చేశారు.

ముగ్గురు కలప స్మగ్లర్ల రిమాండ్

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన కలప స్మగ్లర్లు శనిగారపు మొగిలి, నవాబ్‌పేట్‌కు చెందిన ఎనకుశి సత్తన్న, జక్కుల సత్తన్నలను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పాండ్వపూర్ డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధార్థ తెలిపారు. సదరు నిందితులు కలప తరలిస్తూ పట్టుబడడంతో ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్టీపీపీలో క్రికెట్ పోటీలు

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో 11వ సీజన్ క్రికెట్ లీగ్ ఫైనల్స్ పోటీలు సాగుతున్నాయి. బుధవారం పీఎంపీఎల్ గేమ్ ఛేంజర్స్, థండర్ స్ట్రైకర్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో విజేతగా నిలిచిన థండర్ స్ట్రైకర్స్ జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన పీఎంపీఎల్ గేమ్ ఛేంజర్స్ జట్లకు ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు బహుమతులు అందజేశారు.

'ఇచ్చేది మేమే.. తెచ్చేదీ నేనే'

బోథ్: బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇస్తున్న నిధులు కాంగ్రెస్ పార్టీ కేటాయించినవేనని, తానే ప్రతిపాదనలు పంపి మంత్రి సీతక్క చొరవతో నిధులు తీసుకువస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే మంత్రి సీతక్క నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూ.10 కోట్లు, జున్ని, మాన్కాపూర్ గ్రామాలకు బీటి రోడ్ల కోసం రూ.5 కోట్లు విడుదల చేశారన్నారు. కానీ బీఆర్‌ఎస్ నాయకులు తమ వల్లే నిధులు మంజూరు చేశారని అసత్యపు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా గజేందర్‌ను బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, మాజీ వార్డు సభ్యులు షేక్ షాకీర్, అబూద్, రాజు, హసీబ్, జునేద్, తదితరులు పాల్గొన్నారు.


ఆడె గజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

'ఆదివాసీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి'

ఆదిలాబాద్: ఆదివాసీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ అన్నారు. బుధవారం మావల మండలంలోని కుమురంభీం కాలనీలో ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న ఆదివాసీలతో కలిసి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులకు పోస్ట్‌కార్డులను పంపించారు. అంతకుముందు కాలనీ నుంచి జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్‌ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇళ్ల పట్టాలు, నీళ్లు, కరెంటు, విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కేంద్ర స్థాయిలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో పోస్టల్ కార్డులు పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావు, ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇందిర, సోయం లలిత, రామదాస్, వరుణ్, యాదవ్, గణపతి, భుజంగరావు, తుల సీరామ్, సంతోష్, కేశవ్ మూర్తి పాల్గొన్నారు.


పోస్టుకార్డులు వేస్తున్న కాలనీవాసులు